సాక్షి ఒడిశా

శనివారం ı 5 ı అక్టోబర్ ı 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

| | |
|---|---|
| నగదు | రూ.3,35,317 |
| బంగారం | 4 గ్రాముల 950 మిల్లీ గ్రాములు |
| వెండి | 97 గ్రాముల 100 మిల్లీ గ్రాములు |

– భువనేశ్వర్/పూరీ



అభివృద్ధి జరిగేలా.. ఆశలు తీరేలా..!

ఉత్తరాంధ్రకు ప్రాధాన్యత కల్పించే దిశలో రైలు రవాణా విస్తరణకు ఉన్నత స్థాయి ప్రతిపాదనలు తెరకెక్కాయి.

- 6లో.

విద్యుత్ షాక్‌తో వృద్ధురాలికి గాయాలు



పంట పొలం మధ్య గుండా వెళ్లిన ఒక విద్యుత్ తీగ తెగి కిందపడిపోవడంతో వృద్ధురాలు గాయాలకు గురైంది.

- 6లో.

## న్యూస్‌రీల్

### గ్రామ దేవతల లాఠీలకు ఆహ్వానాలు



వేడుకలకు ఆహ్వానిస్తున్న దేవదాయ శాఖ ప్రతినిధులు

**జయపురం:** రాజుల కాలంనాటి సాంప్రదాయం పాటిస్తూ జయపురం దసరా ఉత్సవాల్లో పాల్గొనాలని అవిభక్త కొరాపుట్ జిల్లాలో 72 గ్రామ దేవతల లాఠీలకు గురువారం నుంచి ఆహ్వానాలు అందజేస్తున్నారు. జయపురం దేవదాయ విభాగ ప్రతినిధులుగా జితేంద్ర దొలాయ్, మధు పూజారి, మదన పూజారిలు వివిధ గ్రామాలకు వెళ్లి గ్రామ దేవతలకు ఆహ్వానాలు అందజేస్తున్నారు. దేవతల మందిరాలకు వెళ్లి పూజలు చేసి కొత్త బియ్యం ఇచ్చి దసరా వేడుకలకు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు.

### అర్పణ్ బియ్యం వేలం

**భువనేశ్వర్:** శ్రీమందిరం ప్రాకార ప్రాజెక్టు ప్రారంభం పురస్కరించుకుని పోగైన అర్పణ్ బియ్యం కథ ముగిసింది. ప్రభుత్వ ఆమోదంతో ముందస్తు నిర్ణయం ప్రకారం ఈ బియ్యం వేలం వేశారు. దీని నుంచి సమకూరిన సొమ్ముని శ్రీమందిరం ఖజానాకు బదిలీ చేయడం జరుగుతుందని లోగడ ప్రకటించారు. అర్పణ్ బియ్యం వేలంతో సమగ్రంగా రూ.2.86 కోట్లు వచ్చాయి. రాష్ట్రం నలుమూలల భక్తులు స్వచ్ఛందంగా సమర్పించిన అర్పణ్ బియ్యం పాక్షికంగా వినియోగించారు. మిగిలిన బియ్యం పలు సురక్షిత ప్రాంతాల్లో భద్రపరిచారు. వీటిలో 10,322 క్వింటాళ్ల బియ్యం వేలం వేశారు. వేలంలో ఒక్కో క్వింటాల్ ధర రూ.2,780 పలికిందని పూరీ జిల్లా కలెక్టర్ సిద్ధార్థ శంకర స్వయి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అర్పణ్ రథం సంచారంతో భక్తులు 14 వేల క్వింటాళ్ల బియ్యం సమర్పించారు. దీనిలో నామ మాత్రంగా 4 వేల క్వింటాళ్లు మాత్రమే వినియోగించారు. మిగులు బియ్యం వేలం వేసేందుకు ఆహ్వానించడంతో 5 మంది ఔత్సాహిక వ్యక్తులు టెండర్లు దాఖలు చేశారు. వీరిలో నిమ్మాపడా మా తరిణి రైసు మిల్లు యజమాని సురేష్ కుమార్ మహంతి వేలం దక్కించుకున్నారు.

### బాధ్యతల స్వీకరణ



**పర్లాకిమిడి:** గజపతి జిల్లా కొత్త ఎస్పీగా జితేంద్ర కుమార్ పండా శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ జితేంద్ర కుమార్ పండా ఇంతకు ముందు పూరీ పుణ్యక్షేత్రం పోలీసు సెక్యూరిటీ అధికారిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై గజపతి జిల్లా ఎస్పీగా నియమితులయ్యారు. జిల్లాలో శాంతి భద్రతలు పరిరక్షించి, అసాంఘిక శక్తులను నిర్మూలిస్తానన్నారు. ఆయనను డీఎస్పీ సునీల్ మహంతి, ఎస్‌డీపీవో ఎస్‌డీపీవో మాధవానంద నాయక్, ఆదర్శ పోలీసుస్టేషన్ అధికారి ప్రశాంత్ భూపతి తదితరులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

### రేపటి నుంచి హబిషాలి నమోదు

**భువనేశ్వర్:** పవిత్ర కార్తీక మాసం సందర్భంగా నెల రోజులపాటు నిరవధికంగా హబిషాలీలు కార్తీక వ్రతం నిర్వహిస్తారు. ప్రధానంగా వితంతు, వయో వృద్ధ మహిళలు ఈ వ్రతం ఆచరిస్తారు. అత్యధికులు పూరీ శ్రీజగన్నాథుని సన్నిధికి చేరుకుని బస చేసి వ్రతం ముగించి స్వస్థలాలకు తిరిగి వెళ్తారు. వీరి కోసం రాష్ట్ర ప్రభుత్వం వ్రతం నిర్వహించుకునేందుకు సకల ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రం నలుమూలల నుంచి హబిషాలీలు పూరీ శ్రీజగన్నాథుని సన్నిధిలో బస చేసేందుకు అనుకూల సౌకర్యాలు కల్పిస్తోంది. ఈ ఏడాది సమగ్రంగా 2,500 మంది హబిషాలీల కోసం కార్తీక వ్రతం ఏర్పాట్లు చేస్తున్నట్లు పూరీ జిల్లా కలెక్టర్ సిద్ధార్థ శంకర స్వయి శుక్రవారం తెలిపారు. దీనికోసం ఔత్సాహిక హబి షాలీలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఈనెల 6వ తేదీ నుంచి ఆరంభం అవుతుందని ప్రకటించారు. http://edistrict.odisha.gov.in వెబ్‌సైటులో వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. వీరంతా బస చేసేందుకు పూరీ పట్టణంలో 4 వేర్వేరు చోట్ల వసతి సదుపాయాలు సిద్ధం చేశారు. ఆయా ప్రాంగణాల్లో కార్తీక వ్రతం సామూహికంగా నిర్వహించేందుకు వీలుగా సౌకర్యాలు అందుబాటులో ఉంటా యి. నిత్యం శ్రీజగన్నాథుని దర్శించేందుకు సులభ దర్శన సౌకర్యంతో వసతి ప్రాంతం నుంచి శ్రీమందిరానికి ఉచిత రవాణా సదుపాయం అందుబాటులో ఉంటుంది. నిత్యం స్వామి మహాప్రసాదం వసతి ప్రాంగణంలో సిద్ధం చేస్తారు. వసతి కేంద్రాల్లో ఆరోగ్య, వైద్య సదుపాయాలతో పటిష్టమైన అగ్ని మాపక వ్యవస్థ ఉంటుందని వివరించారు.

# బాలా త్రిపుర సుందరి.. నమోస్తుతే..!



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దీనిలో భాగంగా ప్రజలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల కుంకుమ పూజలు జరిపారు. సామాన్య ప్రజలతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

మల్కన్‌గిరి: మా కాళీ వేషధారణలో యువతి





మల్కన్‌గిరి: దుర్గా అవతారంలో యువతులు



మల్కన్‌గిరి: ప్రత్యేక అలంకరణలో పూజలందుకుంటున్న అమ్మవారు



రాయగడ: బాలా త్రిపుర సుందరి రూపంలో దర్శనమిస్తున్న లక్ష్మీ అమ్మవారు



జయపురం: గుజరాతీ కాలనీలో...




జయపురం: దర్శనమిస్తున్న మా జగత్ జననీ



జయపురం: ప్రైవేట్ బస్టాండ్‌లో దేవీ పూజలు



కొరాపుట్: జయపూర్ రాజకోట వద్ద కొలువుదీరిన దుర్గమ్మ



పర్లాకిమిడి: పెద్ద బ్రాహ్మణ వీధిలో కొలువుదీరిన అమ్మవారు



మల్కన్‌గిరి: దర్వలో పాల్గొన్న యువతీ, యువకులు బృందం



జయపురం: జగత్ జననీ మందిరంలో దేవికి దీపారాధనలు



కొరాపుట్: నబరంగ్‌పూర్ బందారు ఘరణి శక్తి పీఠం వద్ద కలెక్టర్ శుభంకర్ పాత్రో దంపతులు



కొరాపుట్: ముత్యాలమ్మ దేవాలయం వద్ద భక్తుల కోలాహలం



పర్లాకిమిడి: బాలసదన్‌లో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

## దుర్గా కమిటీలతో పోలీసుల సమావేశం



కమిటీల సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

**పర్లాకిమిడి:** దుర్గా శరన్నవరాత్రుల ఉత్సవాలు పర్లాకిమిడిలోని పలు కూడళ్లలో గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా దుర్గా మండపాల కమిటీ నిర్వాహకులతో పోలీసు అధికారులు శుక్రవారం ఉదయం ఆదర్శ పోలీసుస్టేషన్ కాన్ఫరెన్స్ హాలులో సమావేశమయ్యారు. పర్లాకిమిడిలోని అన్ని కూడళ్లలో శరన్నవరాత్రులు జరుగుతున్న మండపాల వద్ద ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణపై సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్, ఆదర్శ పోలీసుస్టేషన్ ఐఐసీ ప్రశాంత్ భూపతి కమిటీల సభ్యులకు పలు సూచనలు చేశారు. ప్రతీ పూజా మండపం వద్ద ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు బలగాలు మోహరిస్తామని మాధవానంద నాయక్ అన్నారు. దీని కోసం దుర్గా మండపాల కమిటీ సభ్యుల డిక్లరేషన్‌ను తీసుకున్నారు. సమావేశంలో కటికవీధి ఆదర్శదాస్, వార్డు కౌన్సిలర్ బాలకృష్ణ పాత్రో, పెద్ద బ్రాహ్మణవీధి పూజా కమిటీ సభ్యులు సంతోష్ పాణిగ్రాహి, మనోజ్ సాబత్ తదితరులు పాల్గొన్నారు.

## పేలిన లారీ డీజిల్ ట్యాంకర్

- ముగ్గురికి గాయాలు



గాయాలుపాలైన నాగేశ్వరరావు



గాయాలతో వెల్డర్ హరి

**రాయగడ:** లారీకి సంబంధించి గ్యాస్ వెల్డింగ్ చేస్తున్న సమయంలో పక్కనే ఉన్న లారీ డీజిల్ ట్యాంక్ పేలి ముగ్గురు గాయపడిన ఘటన స్థానిక ఎఫ్‌సీఐ రోడ్డు గంగా గ్యారేజీ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మజ్జి నాగేశ్వరరావు, హరి, ఈశ్వరరావులు గాయపడ్డారు. వీరిలో నాగేశ్వరరావు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం విజయనగరం తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక గంగా గ్యారేజీకి ఒక లారీ మరమ్మతుల కోసం వచ్చింది. ఈ క్రమంలో లారీకి చెందిన ఒక భాగాన్ని గ్యాస్ వెల్డింగ్ చేస్తున్న సమయంలో ఆ వేడికి లారీ డీజిల్ ట్యాంక్ పేలిపోయింది. దీంతో వెల్డింగ్ చేస్తున్న హరి, పక్కనే ఉన్న లారీ డ్రైవర్ ఈశ్వరరావు, అదేవిధంగా గ్యారేజీ యజమాని నాగేశ్వరావులపై డీజిల్ పడి గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అనంతరం లారీ ట్యాంక్‌లో వ్యాపించిన మంటలను అదుపు చేశారు.

# బంద్ విజయవంతం



మల్కన్‌గిరి: నిర్మానుష్యంగా మారిన బస్టాండ్ రహదారి



జయపురం: బస్టాండ్‌లో నిలిచిన బస్సులు



జయపురం: రోడ్డుపై నిలిచిన లారీలు



కొరాపుట్: చందాహండిలో నిరసన



కొరాపుట్: నబరంగ్‌పూర్ మెయిన్ రోడ్డులో బంద్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు మున్నా త్రిపాఠి తదితరులు

**జయపురం:** స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని కొరాపుట్ జిల్లా కార్యాచరణ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు 12 గంటల బంద్ జయపురంలో విజయవంతమైంది. పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేట్ బస్సులు నిలిచిపోయాయి. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయం మూతపడ్డాయి. వివిధ బ్యాంక్‌లు మూతపడడం వలన లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయాయి. వ్యాపార వాణిజ్య సంస్థలు, దైనిక బజారుల వ్యాపారులు బంద్‌లో పాల్గొని విజయవంతం కావడానికి దోహదపడ్డారు. 26వ జాతీయ రహదారి, విజయవాడ – రాంచీ జాతీయ కారిడార్‌లలో అనేక వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బహిణీపతి పాల్గొని ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం చూపుతున్న పక్షపాత వైఖరిని తూర్పారబట్టారు. స్థానికులకు ఉద్యోగాలు కల్పించేంతవరకు తాను ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని ప్రకటించారు. జిల్లా యువ కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్ సామంతరాయ్, ఎస్టీ, ఎస్సీ, దళిత మహా సమాజ్ మహిళా అధ్యక్షురాలు మనస్వినీ టక్రి, దళిత మహా సమాజ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

**మల్కన్‌గిరి:** బంద్‌లో భాగంగా మల్కన్‌గిరిలోని అన్ని సంస్థలు మూతబడ్డాయి. అన్ని సంఘాలు జిల్లాల ప్రాతిపదికన ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వం ఈ విషయంపై నిర్ణయం తీసుకోకపోవడంతో అనేక మంది యువత నిరుద్యోగులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నిర్ణయం తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**రాయగడ:** జిల్లాల వారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని గుణుపూర్‌లో శుక్రవారం నిర్వహించిన బంద్ విజయవంతమయ్యింది. ఎస్సీ, ఎస్టీ కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బంద్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, డీసీసీ మాజీ అధ్యక్షుడు బిజయ్ కుమార్ గొమాంగో, కూటమి అధ్యక్షుడు చక్రపాణి సబర్, జగదీష్ గొమాంగో తదితరులు నేతృత్వం వహించారు. బంద్ ఫలితంగా గుణుపూర్‌లో వ్యాపార, విద్యా సంస్థలు, పెట్రోల్ బంక్‌లు తదితరమైనవి మూతపడ్డాయి. అనంతరం ఆందోళనకారులు సబ్ కలెక్టర్ దీప్తికర్ సహోటీకు వినతిపత్రం సమర్పించారు.

**కొరాపుట్:** కింది స్థాయి ఉపాధ్యాయులు, గ్రూప్–డీ ఉద్యోగాల నియామకాలను జిల్లాస్థాయిలో భర్తీ చేయాలనే డిమాండ్‌తో అవిభక్త కొరాపుట్ జిల్లాలో బంద్ జరిగింది. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి అధికార బీజేపీ మినహా కాంగ్రెస్, బీజేడీ, వామపక్షాలు ఈ బంద్ నిర్వహించాయి. కొరాపుట్, రాయగడ, నబరంగ్‌పూర్, మల్కన్‌గిరి జిల్లాల్లో వర్తక వాణిజ్య సంస్థలు తెరవలేదు. రైలు, బస్సులు సేవలకు ఆటంకం కలిగింది. ఎక్కడిక్కడే ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే ఈ బంద్ పర్యవేక్షించారు.



కొరాపుట్: లక్ష్మీపూర్‌లో ఎమ్మెల్యే పవిత్ర శాంత తదితరుల ఆందోళన



కొరాపుట్: నబరంగపూర్ గాంధీ జంక్షన్ వద్ద అఖిల పార్టీల నాయకుల ఆందోళన



రాయగడ: రోడ్లపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ఆందోళనకారులు

## క్లుప్తంగా

### వేధిస్తున్న అప్రకటిత విద్యుత్ కోతలు

పర్లాకిమిడి: జిల్లా కేంద్రం పర్లాకిమిడిలో తరచూ అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తుండడంతో వ్యాపార సంఘాలు, ప్రజలు అసహనానికి గురవుతున్నారు. ఒకపక్క ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడుతుంటే, కరెంటు కోతలు విధిస్తుండడంతో టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరచూ పవర్ కట్ వల్ల దసరా రోజుల్లో వ్యాపారాలు సన్నగిల్లుతున్నాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విజయ దశమి అనంతరం టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి దండపాణి రైయితో హెచ్చరించారు.

### వృద్ధుడు కిడ్నాప్


మధు కులాంగ్ (ఫైల్)

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా గుంటబేడ పంచాయతీ హంసగూడ గ్రామానికి చెందిన మధుకులాంగ్ అనే 60 ఏళ్ల వృద్ధుడు గత నెల 27వ తేదీన కిడ్నాప్‌కు గురయ్యాడు. ఈ మేరకు చిత్రకొండ పోలీసులకు కుటుంబ సభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. హంసగూడ గ్రామంలో మధు భూత వైద్యుడు. అయితే గత నెల 27న సాయంత్రం 4 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి తమతో రమ్మని చెప్పి బైక్‌పై తీసుకొని వెళ్లారు. అయితే ఆరోజు నుంచి మధు ఆచూకీ తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అతని సెల్‌ఫోన్ కూడా పని చేయడం లేదని చెప్పారు.

### స్కూటీపై పడిన చెట్టు

- ఒకరికి గాయాలు


స్కూటీపై పడిన చెట్టు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి బెజాంగ్‌వాడ పంచాయతీ నుంచి బలిమెలకు వెళ్లే ప్రధాన రహదారిలో శుక్రవారం ఉదయం ఈదురుగాలులు వీచాయి. దీంతో ఆ సమయంలో అటుగా వెళ్తున్న స్కూటీపై ఒక చెట్టు పడడంతో స్కూటీ నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆ వ్యక్తిని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించి చెట్టును తొలగించి, వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు.

### చిన్నారులకు స్వెటర్ల పంపిణీ


స్వెటర్లతో చిన్నారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి, కోరుకొండ, మత్తిలి, కలిమెల, పోడియా, ఖోయిర్‌పూట్, చిత్రకొండ సమితుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు ఐసీడీఎస్ సంస్థ తరుపున స్వెటర్లు శుక్రవారం పంపిణీ చేశారు. వాటిలో పాటు షూస్, ఇతర పోషకాహార పదార్థాలు అందజేశారు.

### ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు


వెలుగుతున్న సిగ్నల్ లైట్లు

జయపురం: పట్టణంలోని లేబర్ కార్యాలయ కూడలి 26వ జాతీయ రహదారిలో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు గురువారం ఏర్పాటు చేశారు. దీనివలన వాహన చోదకులకు, బాటసారులకు ఎంతో సౌకర్యంగా ఉందని, ప్రమాదాలు నివారణకు ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు దోహదపడుతున్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు.

### పురుగు మందు తాగి గిరిజనుడి ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండలంలోని మేఘవరం పంచాయతీ పరిధి జక్కరపేట గ్రామానికి చెందిన పాత్రపురం మంగులు(60) అనే గిరిజనుడు పురుగుల మందు తాగి శుక్రవారం మృతి చెందారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. మృతుడు మంగులు గత కొంత కాలంగా ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారు. సమస్యలు ఎక్కువ కావడంతో శుక్రవారం తన ఇంటిలో ఉన్న గడ్డి మందు తాగేశారు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆయనను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. 108లో వెళ్తుండగా కోటబొమ్మాళి దాటిన తర్వాత ఆయన మృతిచెందారు.

అనంతరం మృతదేహాన్ని నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై టెక్కలి సీఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## అభివృద్ధి జరిగేలా..

# ఆశలు తీరేలా..!


మండల రైల్వే కమిటీ సమావేశానికి హాజరైన ఎంపీలు

- ఖుర్దారోడ్ మండల స్థాయీ కమిటీ సమావేశం నిర్వహణ
- ఒడిశా–ఆంధ్ర రాష్ట్రాల రైల్వేల అభివృద్ధికి చర్యలు
- శ్రీకాకుళం మీదుగా రైళ్లకు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రతిపాదనలు

భువనేశ్వర్:

ఉత్తరాంధ్రకు ప్రాధాన్యత కల్పించే దిశలో రైలు రవాణా విస్తరణకు ఉన్నత స్థాయి ప్రతిపాదనలు తెరకెక్కాయి. ప్రధానంగా శ్రీకాకుళం రోడ్ ప్రధాన కేంద్రంగా జిల్లావ్యాప్తంగా లబ్ధిపొందే రీతిలో రైలు సౌకర్యాల కోసం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు రైల్వే శాఖకు ప్రతిపాదించారు. స్థానిక జోనల్ ప్రధాన కార్యాలయంలో తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్, ఖుర్దారోడ్ మండల రైల్వే అధికారి(డీఆర్‌ఎం) ఇతరేతర సీనియర్ అధికారులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కటక్ లోక్‌సభ సభ్యుడు భర్తృహరి మెహతాబ్ మండల రైల్వే స్థాయీ కమిటీ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



బిజూ పట్నాయక్ విమానాశ్రయం సందర్శనలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

### పూరీ నుంచి తిరుపతికి

తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ డివిజన్ పరిధిలో శ్రీకాకుళం జిల్లా ఇమిడి ఉంది. దీంతో పూరీ శ్రీజగన్నాథుడు సన్నిధి నుంచి తిరుపతి వేంకటేశ్వర స్వామి క్షేత్రానికి అనుసంధానపరుస్తూ శ్రీకాకుళం జిల్లా మీదుగా పూరీ – తిరుపతి వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని ప్రతిపాదించారు. అలాగే భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్ మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సేవలను అందుబాటులోకి తేవాలని కీలక ప్రతిపాదన చేశారు. కేంద్రమంత్రితో ఇచ్ఛాపురం శాసన సభ్యుడు బెందాళం అశోక్ ఉన్నారు. అలాగే ఈ పరిధిలో ఇచ్ఛాపురం, పలాసలో చేపట్టిన అమృత్ భారత్ స్టేషన్ల పనుల పురోగతిని సమీక్షించారు. జాడుపూడి, మందస, పలాస కాలినడక వంతెన (ఎఫ్‌వోబీ) నిర్మాణం చకాచకా ముగించి స్థానికుల ప్రయోజనాల దృష్ట్యా పలు స్టేషన్లలో రైళ్ల హాల్టుల గురించి ప్రస్తావించారు.

### ఇరురాష్ట్రాల్లో రైల్వేరంగం అభివృద్ధిపై చర్చ

ఒడిశా, ఆంధ్రప్రదేశ్ ఎంపీలు ఒకే చోట సమావేశమై ఇరురాష్ట్రాల్లో రైల్వే రంగం అభివృద్ధిపై లోతుగా చర్చించారు. ఖుర్దారోడ్ మండల స్థాయీ కమిటీ సమావేశం పురస్కరించుకుని వీరంతా శుక్రవారం సమావేశయ్యారు.

ఈ సమావేశానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, శ్రీకాకుళం ఎంపీ కె.రామ్మోహన్ నాయుడు, జగత్‌సింగ్‌పూర్ ఎంపీ బిభు ప్రసాద్ తొరై, పూరీ ఎంపీ డాక్టర్ సంబిత్ పాత్రో, రాజ్యసభ సభ్యురాలు సులతా దేవ్, రాజ్యసభ సభ్యుడు సుభాసిష్ ఖుంటియా, బరంపురం ఎంపీ డాక్టర్ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి, కెంజొహర్ ఎంపీ అనంత నాయక్, కంధమల్ ఎంపీ సుకాంత కుమార్ పాణిగ్రాహి, జాజ్‌పూర్ ఎంపీ డాక్టర్ రవీంద్ర నారాయణ్ బెహెరా, భద్రక్ ఎంపీ అభిమన్యు సెఠి హాజరయ్యారు.

# రాజ్యాంగబద్ధ పదవులకు మోక్షమెప్పుడో..?

- నెలలు గడుస్తున్నా భర్తీకాని పదవులు
- నిరుపయోగంగా మారిన శాఖలు

భువనేశ్వర్: రాష్ట్రంలో పలు కీలకమైన రాజ్యాంగబద్ధ పదవులు దీర్ఘకాలంగా భర్తీ కావడం లేదు. లోకాయుక్త, ఒడిశా విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఓఈఆర్‌సీ) అధ్యక్షుడు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వంటి కీలక పదవులు ఖాళీగా ఉన్నాయి. ఈ పదవుల భర్తీపై ప్రభుత్వ చర్యలు శూన్యంగా పరిణమిస్తున్నాయి. రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ) జలద కుమార్ త్రిపాఠి పదవీ కాలం కూడ శుక్రవారంతో ముగిసింది. అయితే ఈ పోస్టు భర్తీ కోసం రాష్ట్ర సమాచారం మరియు ప్రజా సంబంధాల శాఖ నోటిఫికేషను జారీ చేసింది. ఈ నియామకం కోసం జారీ చేసిన నిర్ధారిత దరఖాస్తు దాఖలు గడువు నవంబరు 2తో ముగుస్తుంది.

### ఐదుగురు సభ్యులేరీ..?

రాష్ట్ర సమాచార కమిషన్‌లో 5 మంది సభ్యులు, ఒక అధ్యక్షుడు ఉండాల్సి ఉంది. ప్రస్తుతం 2 మంది సభ్యులు సుశాంత కుమార్ మహంతి, జగన్నాథ్ రథ్‌తో కొనసాగుతోంది. ఈ లెక్కన సమాచార కమిషన్‌లో కీలకమైన 3 మంది సభ్యుల పదవులు ఖాళీగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర లోకాయుక్త అధ్యక్ష పదవి గత 6 నెలలుగా ఖాళీగా పడి ఉంది. లోకాయుక్త అధ్యక్షుడు జస్టిస్ అజిత్ సింగ్, సభ్యుడు బి.కె.నాయక్ ఈ ఏడాది మార్చిలో ఈ హోదాల నుంచి విరామం పొందారు. ఇదిలా ఉండగా మరో 2 మంది సభ్యుల్లో దేబబ్రత స్వంయి ఈ ఏడాది ఏప్రిల్ 4న, ఆర్.పి.శర్మ ఆగస్టు 8న పదవీ కాలం పూర్తి చేసుకుని విరామం పొందారు. దీంతో లోకాయుక్త వ్యవస్థ మొరాయిస్తోంది. దీంతో ఇక్కడ స్థిరంగా పనిచేస్తున్న 40 మంది సిబ్బంది పనీపాటా లేకుండా జీతభత్యాలు పొందుతున్నారు. వీరి జీతభత్యాల ఖాతా కింద రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ. 9 కోట్లు వరకు వెచ్చిస్తున్నట్లు సమాచారం.

### గతంలో సన్నాహాలు

గత ప్రభుత్వం లోకాయుక్త వ్యవస్థలో ఖాళీ పదవుల భర్తీ కోసం భారీగా సన్నాహాలు చేసింది. ఈ సన్నాహాలు ఇప్పటివరకు వాస్తవ కార్యాచరణకు నోచుకోకపోవడంతో సంకట పరిస్థితి తాండవిస్తుంది. లోకాయుక్త అధ్యక్షుడు, సభ్యుల నియామకం కోసం గత ప్రభుత్వం జస్టిస్ వి.గోపాల గౌడ అధ్యక్షతన ఈ ఏడాది ఫిబ్రవరి 21న అభ్యర్థుల ఎంపిక (సెర్చ్) కమిటీ నియమించింది. ఈ కమిటీ ఈ ఏడాది మార్చి 28వ తేదీన ప్రభుత్వానికి తన సమగ్ర నివేదిక దాఖలు చేసింది. ఇంతలో 6 నెలలు గడిచినా కమిషన్ సిఫారసులు కార్యాచరణకు నోచుకోలేదు. లోకాయుక్త వ్యవస్థ నిరవధికంగా పనిచేసే దిశలో రాష్ట్రంలో తొలిసారి బాధ్యతలు చేపట్టిన భారతీయ జనతా పార్టీ ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంది. ఒడిశా విద్యుత్ నియంత్రణ కమిషన్(ఓఈఆర్‌సీ) అధ్యక్షుడి పదవి గతేడాది నవంబర్ 17వ తేదీ నుంచి ఖాళీ అయింది. ఈ హోదాలో నియమితులైన సురేష్ చంద్ర మహాపాత్రో ఆకస్మాతుగా పదవికి రాజీనామా చేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఓఈఆర్‌సీ ప్రస్తుతం 2 మంది సభ్యులు గజేంద్ర మహాపాత్రో, సుశాంత కుమార్ రాయ్‌తో కాలక్షేపం చేస్తోంది. దాదాపు ఏడాది కాలంగా ఓఈఆర్‌సీ అధ్యక్షుడు లేకుండా చలామణి కావడం సర్వత్రా ప్రశ్నార్థకమైంది.

### పదవీ కాలం పూర్తైనా..

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదిత్య ప్రసాద్ పాఢి పదవీ కాలం ఈ ఏడాది ఆగస్టు 19వ తేదీతో ముగిసింది. ఆయన స్థానంలో కొత్త అభ్యర్థి ఇంతవరకు నియామకం కాకపోవడంతో నిరవధికంగా కొనసాగుతున్నారు. నిబంధనల మేరకు కొత్త అభ్యర్థి నియమితులయ్యేంత వరకు నిరవధికంగా కొనసాగాల్సిన నియమం మేరకు ఆదిత్య ప్రసాద్ పాఢి కాలక్షేపం చేస్తున్నారు. ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి హోదా నుంచి స్వచ్ఛంద విరామం పొంది 2019 సంవత్సరం ఆగస్టులో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ హోదాలో నిరవధికంగా 5 ఏళ్ల లేదా తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు కొనసాగాల్సి ఉన్నందున చలామణి అవుతున్నారు.

# గజలక్ష్మీ పూజకు ముహూర్తపు రాట


ముహూర్తపు రాట పూజ నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయిలో ఈనెల 16వ తేదీ నుంచి జరగనున్న గజలక్ష్మీ పూజలకు సంబంధించి శుక్రవారం ముహూర్తపు రాట కార్యక్రమం జరిగింది. సికరపాయిలోని కొత్త బస్టాండు వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు కానున్న మండపం ప్రాంగణంలో ఈ మేరకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకులు సంతోష్ దాస్ ఆధ్వర్యంలో జరిగిన ముహూర్తపు రాట పూజల్లో ప్రముఖ వ్యాపారి జి.ఉమా శంకర్, రేవతి దంపతులు పాల్గొన్నారు. గత 22 ఏళ్లుగా ఇక్కడ గజలక్ష్మీ పూజలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. పదమూడు రోజుల పాటుగా ఇక్కడ పూజలు జరుగుతాయి.

# విద్యుత్ షాక్‌తో వృద్ధురాలికి గాయాలు


చికిత్స పొందుతున్న తులసీ

రాయగడ: పంట పొలం మధ్య గుండా వెళ్లిన ఒక విద్యుత్ తీగ తెగి కిందపడిపోవడంతో దానిని తాకిన వృద్ధురాలు గాయాలకు గురైంది. జిల్లాలోని కాసీపూర్ సమితి దొరాగుడ పోలీస్‌స్టేషన్ పరిధి కుచేయిపాదొరొ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటనలో గాయాలుపాలైన మహిళ తులసీ మాఝిగా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. తమ పంట పొలంలో పండుతున్న మొక్కజొన్న పొత్తులు, తోటకూరను తీసుకెళ్లేందుకు పొలానికి తులసీ వెళ్లింది. అప్పటికే పొలం మీద నుంచి వెళ్లిన విద్యుత్ తీగ తెగి కిందపడి ఉంది. అది గమనించని ఆమె విద్యుత్ తీగపై కాలు పెట్టడంతో షాక్‌కు గురై పడిపోయింది. వెంటనే అక్కడి వారు ఆమెను కాసీపూర్ పీహెచ్‌సీకి చికిత్స కోసం తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు.

# కలప దుంగలు స్వాధీనం


కలప దుంగలతో నిందితులు

రాయగడ: విలువైన కలప దుంగలను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు నిందితులను గుడారి అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. అరెస్టైనవారిలో జయంత్ పాలక, సాయిబ్ గంటలు ఉన్నారు. రేంజర్ దిలీప్ కుమార్ పట్నాయక్ తెలియజేసిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి అటవీ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో గుడారి సమీపంలోని కరంసీ కూడలిలో ఒక పికప్ వ్యాన్ కనిపించింది. దానిని ఆపి తనిఖీలు చేయగా అందులో 25 కలప దుంగలు పట్టుబడ్డాయి. వాటి విలువ సమారు రూ.లక్ష ఉంటుందని పట్నాయక్ చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

## ఉచిత ఇసుక అందని ద్రాక్షే

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఏడురోడ్ల కూడలి వద్ద ప్రభుత్వ ఇసుక విధానానికి వ్యతిరేకంగా ఇసుకను కేజీల రూపంలో అమ్ముతూ వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా నేటికీ ఉచిత ఇసుక అందని ద్రాక్షగానే ఉందని విమర్శించారు. ఇసుక లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న లారీల యాజమానులపై కేసులు నమోదు చేయవద్దంటూ ప్రజా ప్రతినిధులు హుకుం జారీ చేస్తున్నారని, ఈ పద్ధతి మానుకోవాలని ప్రభుత్వానికి హితవుపలికారు.

### టెక్కలిలో..

టెక్కలి: కూటమి ప్రభుత్వ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఉచిత ఇసుక హామీను తక్షణమే అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం టెక్కలి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు కె.ఎల్లయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సరైన పనులు లేక పస్తులుంటున్నారని అన్నారు. తక్షణమే ఉచిత ఇసుక హామీను అమలు చేయాలని తహసీల్దారు కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

# భవన నిర్మాణంపై వివాదం


సమావేశంలో పాల్గొన్న ఎస్‌ఆర్‌సీఎస్ బెహరా తదితరులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి కత్తల కవిటి పంచాయతీలోని పుడ్డుని గ్రామంలో ప్రాథమిక పరపతి సంఘం భవన నిర్మాణాన్ని జాజిపూర్ గ్రామస్తులు వ్యతిరేకించారు. శుక్రవారం కత్తలకవిటి పంచాయతీలో ఎస్‌ఆర్‌సీఎస్ నర్సింగ చంద్ర బెహరా ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. జాజిపూర్ గ్రామంలో 80 శాతం రైతులు ఉన్నారు. రైతులకు మేలు కలిగించేందుకు కత్తల కవిటి లేదా జాజిపూర్ గ్రామంలో ప్రాథమిక పరపతి సంఘ భవనం నిర్మించాలని, లేదంటే ఆందోళన చేస్తామని జాజిపూర్ రైతులు కో-ఆపరేటివ్ సొసైటీ రిజిస్ట్రార్‌ను కోరారు. పుడ్డుని గ్రామంలో పరపతి సంఘ భవనం నిర్మిస్తే రైతులకు ధాన్యం అమ్మకం, విత్తనాలు, ఎరువులు, రుణాలు పొందడానికి రెండు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉంటుంన్నారు. అందువల్ల రైతులకు మేలు జరిగేలా కత్తల కవిటి లేదా జాజిపురం గ్రామంలో భవనం నిర్మించాల్సిందిగా మెజారిటీ రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# త్వరలో బీపీఐఏ కొత్త టెర్మినల్




భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని త్వరలో మరింత విస్తరిస్తారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సందర్శన పురస్కరించుకుని ఈ విషయం తెలిపారు. ఈ విమానాశ్రయంలో మూడో టెర్మినల్ నిర్మితం అవుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న దాని పక్కనే దీనిని నిర్మించేందుకు యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న 2 ఏళ్లలో బీపీఐఏ టెర్మినల్ – 3 నిర్మాణం పూర్తి అవుతుందని అంచనా. స్థానిక విమానాశ్రయం దేశంలో 20 ప్రముఖ నగరాలతో పాటు 4 విదేశాలకు విమానయాన అనుసంధానం కలిగి ఉంది. డబుల్ ఇంజిన్ సర్కారు హయాంలో ఒడిశాలో పౌర విమానయాన రంగం గణనీయంగా విస్తరిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ప్రస్తుతం స్థానిక విమానాశ్రయం నుంచి ఏటా 40 లక్షల మంది యాత్రికులు రాకపోకలు చేస్తున్నారు.

ఈ పరిమితి రెట్టింపుగా మలిచి ఏటా 80 లక్షల మందికి విస్తరించాలనే యోచనతో తమ విభాగం కృషి చేస్తుందన్నారు. దీంతోపాటు స్వదేశీ, అంతర్జాతీయ విమానయాన పర్యాటకుల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.

# దసరాకు ప్రత్యేక బస్సులు

- అందుబాటులో 360 సర్వీసులు
- సాధారణ చార్జీలే : డీపీటీఓ విజయ్‌కుమార్


శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్

శ్రీకాకుళం అర్బన్: దసరా సందర్భంగా ప్రయాణికుల అవసరాలకు తగినట్టుగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. గతంలో ఆర్టీసీ నడిపే ప్రత్యేక బస్సులమీద అదనపు చార్జీలు వసూలు చేసేవారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ విధానానికి స్వస్తి పలికి సాధారణ చార్జీలతోనే దసరా బస్సులు నడిపించారు. ఇప్పుడు అదే విధానాన్ని పాటించనున్నారు. జిల్లాలోని శ్రీకాకుళం ఒకటి, శ్రీకాకుళం రెండు డిపోలతో పాటు టెక్కలి, పలాస తదితర నాలుగు డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో 333 బస్సులు తిరుగుతున్నాయి. ఇందులో 244 ఆర్టీసీ బస్సులు కాగా 89 హైర్ బస్సులు ఉన్నాయి. వీటికి అదనంగా ఒకటి, రెండు డిపోల పరిధిలో 8 బస్సులు, టెక్కలి, పలాస డిపోల పరిధిలో 5నుంచి 6 బస్సులు అదనంగా ఉండనున్నాయి. వీటిని కూడా రద్దీకి అనుగుణంగా నడపనున్నారు.

### దూర ప్రాంతాల కోసం..

దసరా సందర్భంగా వలస వెళ్లిన వారంతా జిల్లాకు వస్తారు. వీరి రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణ సమయంలో ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా ఉండేందుకు ఆర్టీసీ అధికారులు అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. నాలుగు డిపోల్లో ఉన్న రెగ్యులర్ బస్సులతోపాటు అదనంగా ఒక్కో డిపో నుంచి 3 నుంచి 4 బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ బస్సులు ఆయా రోజుల్లో సుమారు 12 నుంచి 16 ట్రిప్పులు తిరుగనున్నాయి. ప్రస్తుతం రెగ్యులర్‌గా విజయవాడకు 7 షెడ్యూల్ బస్సులు, రాజమండ్రికి 6, అమలాపురానికి 2, రామచంద్రాపురానికి 2 బస్సులు, కొవ్వూరు, భద్రాచలంనకు ఒక్కొక్కటి చొప్పున నడుస్తున్నాయి. అలాగే శ్రీకాకుళం–విశాఖపట్టణం మధ్య నాన్‌స్టాప్ బస్సులు 26 షెడ్యూల్ బస్సులు తిరుగుతున్నాయి. ఈ బస్సులు ప్రతి 15 నిమిషాలకు ఒకటి చొప్పున తిరగనున్నాయి. ఇక హైదరాబాద్ నుంచి శ్రీకాకుళంనకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 4 బస్సులు నడుపుతున్నారు. అక్టోబరు 9వ తేదీన 2 బస్సులు, 10వ తేదీన 2 బస్సులు నడపనున్నారు. ఇక దూరప్రాంతం నుంచి జిల్లాకు చేరుకున్న ప్రయాణికుల కోసం కూడా ప్రత్యేకంగా బస్సులను నడపనున్నారు. జిల్లా కేంద్రం నుంచి కొత్తూరు, బత్తిలి, పాలకొండ, పాతపట్నం, పలాస, ఇచ్ఛాపురం రూట్లలో అధికంగా రద్దీ ఉంటుందని భావించి ఆయా రూట్లలో అదనపు బస్సులు నడపనున్నారు. ఈనెల 9వ తేదీ నుంచి ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందని భావిస్తున్నారు. ఆయా రోజుల్లో రాత్రి 9గంటల నుంచి వేకువజామున 4గంటల వరకూ ప్రతి గంటకూ ఒక బస్సు చొప్పున నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు.

## క్లుప్తంగా

### వీడీవీకేలు సమర్థవంతంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

**పార్వతీపురం:** వన్‌ధన్ వికాస్ కేంద్రాలు(వీడీవీకే) మరింత సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో వన్‌ధన్ వికాస్ కేంద్రాల పనితీరుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులు ఉత్పత్తి చేసిన వస్తువులకు బ్రాండింగ్‌తో పాటు మంచి మార్కెటింగ్ సదుపాయం కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో ఒక మోడల్ వీడీవీకే ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అందుకు అవసరమైన మిషనరీ, శిక్షణ తదితర అంశాలపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల ఏపీఓలు మురళి, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

### హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలుశిక్ష

**జియ్యమ్మవలస:** 2019లో నమోదైన హత్యాయత్నం కేసులో ముద్దాయిని నిర్ధారించిన పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణ ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 20వేలు జరిమానా ముద్దాయికి విధించినట్లు చినమేరంగి ఎస్సై పి.అనీష్ శుక్రవారం తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలంలోని పెదమేరంగి గ్రామానికి చెందిన పల్ల ధర్మారావు, అదే గ్రామానికి చెందిన బంటు లోకనాథం మధ్య పాతకక్షల కారణంగా ధర్మారావు తల, మర్మాంగంపై లోకనాథం గాయపరిచిన ఘటనలో ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై బి.శివప్రసాద్ కేసు నమోదు చేశారు. ఎల్విన్‌పేట సీఐ డీవీజే రమేష్ కుమార్ దర్యాప్తు చేపట్టి అభియోగం పత్రాన్ని కోర్టులో దాఖలు చేశారు. పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరావు వాదనలు వినిపించగా అభియోగాలు నిర్ధారణ కావడంతో ముద్దాయి లోకనాథానికి శిక్ష ఖరారు చేస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

### 21 కిలోల గంజాయి పట్టివేత



గంజాయి ప్యాకెట్లు, నిందితుడు కాలేను చూపిస్తున్న పోలీసులు

**భామిని:** మండలంలోని బత్తిలి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద గురువారం జరిపిన తనిఖీలలో 21 కిలోల గంజాయి తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన హరిశ్చంద్ర కాలేను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు బత్తిలి ఎస్సై డి.అనిల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఒడిశాలోని గుణుపూర్ నుంచి ప్రైవేట్ బస్సులో బ్యాగ్‌లతో తరలిస్తున్న 21 కిలోల గంజాయి సీజ్ చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై చెప్పారు.

### సిబ్బంది సమస్యల పరిష్కారానికే వెల్ఫేర్ డే



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ వకుల్ జిందాల్

**విజయనగరం క్రైమ్:** జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్‌డేను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సమస్యలు తెలుసుకుని వారి నుంచి విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించిన ఆయన వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను స్వయంగా నోట్ చేసుకుని, వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని ఎస్పీ హామీ ఇచ్చారు.

### నేడు రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ నిధులు జమ

**విజయనగరం ఫోర్ట్:** పీఎం కిసాన్ పథకం కింద రైతులకు అక్టోబర్ నెలలో వేసే రూ.2 వేలు శనివారం రైతుల ఖాతాల్లో జమకానుందని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహారాష్ట్రలోని వాసిమ్ జిల్లా వైగొల్ గ్రామంలో నిర్వహించనున్న కిసాన్ సమ్మేళన్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిధులు విడుదల చేస్తారని చెప్పారు. జిల్లాలో 1.85 లక్షల రైతు కుటుంబాలకు ఈ పథకం కింద రూ.37.08 కోట్లు లబ్ధి కలగనుందన్నారు.

# ఎవరికి వారే యమునా తీరే..!



నూతన కార్యాలయంలో పూజలు చేస్తున్న టీడీపీ డివిజన్ ఇన్‌చార్జ్ భూదేవి తదితరులు

- రసకందాయంలో కూటమి రాజకీయం..
- పాలకొండ డివిజన్ కేంద్రంలో టీడీపీ కార్యాలయం ప్రారంభం
- ఇదివరకే ఎమ్మెల్యే నేతృత్వంలో ఓ కార్యాలయం

**పాలకొండ రూరల్:** డివిజన్ కేంద్రం పాలకొండలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పడాల భూదేవి నేతృత్వంలో నూతన పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన టీడీపీ సీనియర్స్ వర్గంగా ఉన్న నాయకులంతా గతం నుంచి భూదేవి వెంట ప్రారంభోత్సవంలో పాల్గొంటున్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడిన తొలి రోజుల్లో పట్టణంలో ప్రస్తుత కూటమి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఓ కార్యాలయం, జనసేన మరో కార్యాలయం నిర్వహించాయి. ఎన్నికల సమయంలో టికెట్ దోబూచులాట అనంతరం ఎట్టకేలకు జయకృష్ణకు అవకాశం వచ్చింది. ఈ క్రమంలో గెలుపే లక్ష్యంగా మూడు పార్టీలు ఒక్కతాటిపైకి రావాలని వారివారి అధిష్టానాలు పేర్కొన్నప్పటికీ ఇక్కడ ఆ పరిస్థితి కనబడడం లేదు.

**కానరాని సమన్వయం**

ఇటీవల పట్టణంలో ప్రారంభమైన కోటదుర్గమ్మ ఉత్సవాల అంకురార్పణకు కూటమి ఎమ్మెల్యే ఓ వర్గంగా, భూదేవి మరో వర్గంగా దేవస్థానానికి రావడం చర్చనీయాంశమైంది. అయితే వారిద్దరి మధ్య బీజేపీ ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా ఇద్దరితో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి తిరుగుతున్నారు. అధికారం వచ్చి వంద రోజులు గడుస్తున్నప్పటికీ వారి మధ్య సమన్వయం లేదన్న విషయం తాజాగా టీడీపీ కార్యాలయం ప్రారంభంతో తేటతెల్లమైంది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య రాజకీయం రసకందాయంలో పడనుందని ఆయా పార్టీలకు చెందిన క్యాడర్ చెవులు కొరుక్కుంటున్నారు. భూదేవి వర్గం గతం నుంచి నిమ్మక జయకృష్ణకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న విషయం నియోజకవర్గ ప్రజలకు విదితమే.

**పక్క జిల్లా మంత్రితో సూచనలు**

తాజాగా వీరు ప్రతి విషయంలో టీడీపీగా తమ దృష్టికి తీసుకురావాలని టీడీపీ నాయకుల అధికారులకు స్పష్టం చేయడంతో పాటు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన మంత్రితో స్పష్టమైన సూచనలు అధికారులకు చేయించినట్లు తెలుస్తుంది. నిజంగా కూటమి నాయకుల మధ్య సమన్వయం ఉంటే ఈ కార్యాలయం ప్రారంభానికి తప్పక భాగస్వామ్య పార్టీ ఎమ్మెల్యే జయకృష్ణ హాజరై ఉండేవారు కదా అనే చర్చ జరుగుతోంది.

# ప్రజలందరిపై దుర్గామాత అనుగ్రహం

- దేవీ దండుమారమ్మ ఆలయంలో ఎస్పీ దంపతుల ప్రత్యేక పూజలు



దేవీదండుమారమ్మ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ దంపతులు

**విజయనగరం క్రైమ్:** దుర్గామాత అనుగ్రహం ప్రజలందరిపైనా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసు బ్యారెక్స్‌లో కొలువై ఉన్న శ్రీ దేవీ దండుమారమ్మ ఆలయాన్ని శుక్రవారం ఆయన తన సతీమణి, 5వ బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్‌తో కలిసి శుక్రవారం దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో ఎస్పీ దంపతులకు స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ దంపతులు అమ్మవారికి కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సీఐ ఏవీ.లీలారావు, మహిళా పీఎస్ సీఐ ఈ.నరసింహమూర్తి, ఆర్ఐలు గోపాలనాయుడు, టి.భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్

**బొబ్బిలిరూరల్:** మండలంలోని పారాది గ్రామం సమీపంలోని వేగావతి నదినుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేసి కేసు నమోదుచేశారు. ముందస్తు సమాచారం మేరకు తెల్లవారు జామున పారాది నుంచి బొబ్బిలి వస్తున్న ఇసుక ట్రాక్టర్లను స్థానిక గ్రోత్ సెంటర్ వద్ద పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేసి..ఎటువంటి రసీదులు లేవని ధ్రువీకరించి కేసు నమోదు చేసినట్లు సీఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు.

**28 మద్యం బాటిల్స్ స్వాధీనం**

మండలంలోని సీహెచ్ బొడ్డవలస గ్రామానికి చెందిన కళ్యాణ్ ప్రకాష్ అక్రమంగా తరలిస్తున్న 28 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. గురువారం రాత్రి నిందితుడు మద్యం బాటిల్స్ తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు నిందితుడిని పట్టుకుని విచారణ చేసి బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ సతీష్ కుమార్ చెప్పారు.

# పాసింజర్ రైలు ట్రయల్ రన్ విజయవంతం




ట్రయల్‌రన్‌లో భాగంగా సాలూరు వచ్చిన రైలు

- రైలును చూసేందుకు ఉత్సాహం చూపిన ప్రజలు

**సాలూరు:** కూ..చుక్..చుక్ అంటూ విశాఖపట్నం బొబ్బిలి మీదుగా సాలూరుకు నడవనున్న ప్యాసింజర్ రైలుకు అధికారులు శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించారు. రైలులో వచ్చిన అధికారులు పట్టాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ట్రయల్ రన్‌కు వచ్చిన రైలును చూసేందుకు స్థానికులు అధికంగా ఉత్సాహం చూపించారు.సెల్ఫీలు తీసుకుంటూ కొందరు..రైలు ఎక్కి మరికొందరు ఫొటోలు తీసుకోవడం కనిపించింది. సాలూరు ప్రజల దశాబ్దాల కల అయిన ఈ సర్వీసు కోసం మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, పలువురు స్థానికులు కొన్నేళ్ల నుంచి చేసిన కృషిని పలువురు చర్చించుకున్నారు. ఈ సర్వీసు కోసం పలుమార్లు రాజన్నదొర కేంద్ర ప్రముఖులు, రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడారని, గతంలో ప్రధానమంత్రికి లేఖ రాశారని మాట్లాడుకున్నారు. ఆయన కృషి..నాటి ఎంపీ గొడ్డేటి మాధవి, నేటి ఎంపీ గుమ్మ తనూజరాణిల ప్రయత్నంతో ఈ సర్వీసు ప్రారంభానికి సిద్ధమైందని చర్చించుకున్నారు.

**హాజరు కాని మంత్రి సంధ్యారాణి**

కాగా ఈ ట్రయల్ రన్‌లో భాగంగా రైలును, రాష్ట్ర మంత్రి సంధ్యారాణి జెండా ఊపి ప్రారంభిస్తారని ప్రచారం జరిగిన నేపథ్యంలో టీడీపీ శ్రేణులు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. కారణమేమోగాని మంత్రి హాజరుకాలేదు. మంత్రి రాకపోవడం భిన్నరకాల చర్చకు దారితీసింది. ట్రయల్ రన్ చూసేందుకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్ తదితరులు రావడం కనిపించింది. ఈ ట్రయల్ రన్ విజయవంతమైన నేపథ్యంలో ఈ నెలలోనే రెగ్యులర్‌గా సర్వీసు ప్రారంభమవుతుందని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# బైక్‌ను ఢీకొట్టిన కారు: అర్చకుడి మృతి



ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు (ఇన్‌సెట్లో)బాలభాస్కర శర్మ (ఫైల్)

**గరుగుబిల్లి:** మండలంలోని తోటపల్లి గ్రామ పరిధిలో గల కర్రల మిషన్ సమీపంలో గురువారం అర్ధరాత్రి ఓ ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న అర్చకుడు మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై పి.రమేష్ నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖడ్గవలస జంక్షన్‌లో బైక్‌పై బయల్దేరిన అర్చకుడు బాలభాస్కర శర్మ (58) చినమేరంగి వయా తుంబలి మీదుగా స్వగ్రామం దత్తివలస వెళ్తుండగా మితిమీరిన వేగంతో ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొంది. దీంతో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాల పాలైన శర్మను చికిత్స కోసం 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడు శర్మకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరఘట్టం సమీపంలోని గ్రామంలో దుర్గాదేవి పూజలకు శర్మ వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

**బైక్ బోల్తాపడి వ్యక్తి..**

**పూసపాటిరేగ:** మండల కేంద్రం పూసపాటిరేగకు చెందిన కలిదిండి మురళీ రాజు బైక్ అదుపు తప్పడంతో జరిగిన ప్రమాదంలో శుక్రవారం మృతిచెందారు. పైడిభీమవరంలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో విధులు ముగించుకుని ఆయన పూసపాటిరేగ వస్తుండగా భీమవరం సమీపంలో బైక్ అదుపుతప్పి బోల్తా పడడంతో ప్రమాదం జరిగి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆయనకు భార్య సుష్మ, కుమారులు నిహాల్ కార్తికేయ వర్మ, రోహిత్ కార్తికేయవర్మ ఉన్నారు. మురళీరాజు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాలో కార్యకర్తగా పనిచేశారు. అందరితో కలివిడిగా ఉండే ఆయన మృతి చెందడంతో పలువురు సంతాపం తెలియజేశారు. .

**కోనేరులో మహిళ మృతదేహం**



చెరువులో తేలిన నాగమ్మ మృతదేహం

**గంట్యాడ:** మండలంలోని బుడతనాపల్లి గ్రామానికి చెందిన జాగ నాగమ్మ ( 57) గ్రామంలోని కోనేరులో శుక్రవారం మృతదేహమై తేలింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నాగమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో పేగుకు సంబంధించి ఆమెకు ఆపరేషన్ కూడా జరిగింది. దీనికి తోడు ఆమెకు ఫిట్స్ ఉన్నాయి. శుక్రవారం ఉదయం గ్రామంలో ఉన్న కోనేరు వైపు వెళ్లిన గ్రామస్తులు నాగమ్మ కోనేరులో శవమై కనిపించడంతో ఆమె కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా సిబ్బంది వచ్చి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు. నాగమ్మ భర్త కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. ఆమె టీ కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తూ ఉండేది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తె చనిపోయింది. ఇద్దరు కుమార్తెలకు వివాహాలయ్యాయి. కొండ తామరాపల్లిలో ఉన్న రెండో కుమార్తె ఇంటి దగ్గర ఆమె ఉండేది. రెండు నెలల క్రితం స్వగ్రామం బుడతనాపల్లికి వచ్చింది. ఆమెకు వ్యక్తిగత మరుగుదొడ్డి లేక పోవడంతో బహిర్భూమికి బయటకు వెళ్లిన సమయంలో ఫిట్స్ వచ్చి కోనేరులో ప్రమాదవశాత్తు పడి మరణించి ఉండవచ్చునని భావిస్తున్నారు.

# 6 ఎకరాల్లో చెరకు దగ్ధం



కాలిన చెరకు పంటను పరిశీలించిన అధికారులు

**సీతానగరం:** మండలంలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో శుక్రవారం సాయంత్రం సంభవించిన అగ్ని ప్రమాదంలో 6 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరకు పంట దగ్ధమైనట్లు వీఆర్వో శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో నీలకంఠాపురం గ్రామానికి చెందిన ఉరిటి గౌరునాయుడు,ఉరిటి సత్యవతమ్మ, బొత్స సూర్యనారాయణ, బోగి విజయమ్మ, సింహాచలం, రౌతు అప్పలనర్సమ్మ, ఎం.రమ, సత్యనారా యణల భూముల్లో లక్షలాది రూపాయల విలువైన పంట అగ్నికి ఆహుతైందని చెప్పారు. పంటనష్టం అంచనాలు వేసి తహసీల్దార్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నామని తెలిపారు. అగ్నిప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

# ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**బొండపల్లి:** మండల కేంద్రాన్ని ఆనుకుని ఉన్న బోడసింగిపేట గ్రామంలో గల వివేకానంద స్కూల్‌లో ఒక వ్యక్తి శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కలకలం రేపిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై యు.మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రం బొండపల్లికి చెందిన తిరుమలరాజు సూర్యనారాయణరాజు(51) విజయనగరంలోని ప్రదీప్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. కొద్ది నెలలుగా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో పాటు, మానసిక వ్యాధులతో బాధ పడుతున్న నేపథ్యంలో మనస్తాపం చెందిన ఆయన స్కూల్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్కూల్ సిబ్బంది విషయాన్ని గమనించి పోలీసులకు తెలియచేయడంతో వారు వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించి మృతుని భార్య రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**గడ్డిమందు తాగి వ్యక్తి..**

**రాజాం సిటీ:** మండల పరిధి ఒమ్మి గ్రామానికి చెందిన చోడవరపు తిరుపతి (45) గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ కె.అశోక్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు తిరుపతిరావు కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ పనులకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. మద్యానికి బానిసైన తిరుపతి రోజూ ఇంటి వద్ద డబ్బులు అడిగే వాడు. కుటుంబసభ్యులు ఇచ్చేందుకు నిరాకరించడంతో ఈ నెల 3న మధ్యాహ్నం పొలంవైపు వెళ్తానని చెప్పి అక్కడ గడ్డిమందు తాగేసి ఇంటికి వచ్చి వాంతులు చేసుకోవడంతో గమనించిన భార్య మంగ, కుమారుడు అశోక్ రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యులు రిఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని భార్య మంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుకోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు



# ఇంటికి పోదాం చలోచలో...





బస్సులు ఎక్కేందుకు క్యూ





రైల్వేస్టేషన్‌పరిసర ప్రాంతాల్లో ప్రయాణికులసందడి



విద్యాసంస్థలకు ఈ నెల 3 నుంచి ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది. దూరప్రాంతాల్లో నివసించేవారంతా పిల్లలతో కలిసి స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. వీరి రాకతో విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్లు సందడిగా మారాయి. ఆర్టీసీకి రద్దీపెరిగింది.

– సాక్షిఫొటోగ్రాఫర్,విజయనగరం

### జిల్లా అవసరాల మేరకు ఇసుక సిద్ధం

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

**విజయనగరం అర్బన్:** జిల్లాలో నిర్మాణాలు నిరాటంకంగా కొనసాగేందుకు వీలుగా తగినంత ఇసుక అందుబాటులో ఉంచినట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. తన చాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో అయన మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇసుక, జిల్లా అవసరాలు, స్టాక్ పాయింట్లు, డీసిల్టింగ్, కొత్త ఇసుక రీచ్‌లు, రవాణా ఏర్పాట్లు, నిఘా తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇసుక రవాణాకు రిజిస్టర్ చేసుకున్న స్థానిక వాహనాలను మాత్రమే అనుమతించాలని ఆదేశించారు. బుక్ చేసుకున్న ఇసుకకు సరిపడేంత వాహనాన్ని మాత్రమే తీసుకురావాలని, ఈ మేరకు యాప్‌లో మార్పులు చేయాలని సూచించారు. జిల్లాలో రానున్న ఆరు నెలల అవసరాలకు సరిపడేటంత ఇసుక అందుబాటులో ఉందని చెప్పారు. వంగర మండలం కొండచాకరాపల్లివద్ద లభ్యమయ్యే 75వేల మెట్రిక్ టన్నుల ఇసుకలో 45వేల మెట్రిక్ టన్నులను బొబ్బలి స్టాక్ పాయింట్‌కు తరలించాలని ఆదేశించారు. మిగిలిన 30వేల టన్నుల ఇసుకను కొత్తగా ఏర్పాటు చేయనున్న చీపురుపల్లి స్టాక్ పాయింట్ వద్ద అందుబాటులో ఉంచాలని, వీలైనంత త్వరగా ఈ స్టాక్ పాయింట్‌ను ప్రారంభించాలని సూచించారు. తెర్లాం మండలం కుసుమూరు వద్ద సుమారు 17వేల టన్నులు, సంతకవిటి మండలం తమరాడ వద్ద 47,000 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, ఈ రెండు ఇసుక రీచ్‌లనుంచి తవ్వకాన్ని మొదలు పెట్టాలని ఆదేశించారు. రేగిడి ఆమదాలవలస మండలం పొర్లి వద్ద అందుబాటులో ఉన్న ఇసుక రీచ్‌పై సర్వే చేసి, ఇసుక తవ్వకానికి సిద్ధం చేయాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు, డ్రోన్ కెమెరాతో నిఘా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు.